క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: మరమ్మతుల కారణంగా సింగపూర్ టౌన్‌షిప్‌లోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని కాలనీలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీష్ కుమార్ తెలిపారు. అన్నోజిగూడ, రాజీవ్ గృహకల్ప, సింగపూర్ టౌన్‌షిప్, వికలాంగుల కాలనీ, సూర్యనగర్, జైపూర్‌కాలనీ, సాయినగర్, ప్రకాష్‌రావునగర్, ఎమరాల్డ్ పార్క్, ఎమరాల్డ్ హైట్స్, పకీర్ టిక్యా, లింగాపూర్, ఇన్ఫోసిస్ మెయిన్ గేట్, శ్రీకృష్ణనగర్, ఎల్‌ఐజీ కాలనీలతో పాటు పరిసర ప్రాంతాల్లోని కంపెనీలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి పాటుపడండి



ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండలానికి చెందిన వీఆర్‌ఏలు తమ సమస్యలు పరిష్కరించేందుకు పాటుపడాలని కోరుతూ గురువారం బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసానికి వెళ్లిన వీఆర్‌ఏలు అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలపై గళం విప్పాలని విజ్ఞప్తి చేయగా ఇందుకు ఈటల సానుకూలంగా స్పందించారు. ఈటలను కలిసిన వారిలో వీఆర్‌ఏలు మోహన్, శ్రీనివాస్, కుమార్, నవీన్, తదితరులు ఉన్నారు.

నాగారం ప్రభుత్వ పాఠశాల ఆకస్మిక తనిఖీ



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న చంద్రారెడ్డి

కీసర: నాగారం ప్రభుత్వ పాఠశాలను గురువారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా స్కూల్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సారి కీసరగుట్ట బ్రహ్మోత్సవాల క్రీడా పోటీల్లో నాగారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తాచాటాలన్నారు. క్రీడాకారులకు, షూ, యూనిఫామ్స్, సాక్స్‌ల కోసం రూ.8 వేలను విరాళంగా ఇచ్చారు.

మర్యాదపూర్వక కలయిక



మంత్రితో గోధుమకుంట సర్పంచ్ మహేందర్‌రెడ్డి

కీసర: సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా గోధుమకుంట గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి గురువారం మంత్రి చామకూర మల్లారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నాలుగేళ్లలో మంత్రి మల్లారెడ్డి సహకారంతో గోధుమకుంట గ్రామ అభివృద్ధికి నిధుల విడుదలకు సంబంధించిన ముద్రించిన బ్రోచర్‌ను మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోమని అంజనేయులు, ఎంపీటీసీలు మంచాల కిరణ్, జ్యోతిప్రవీణ్, వార్డుసభ్యులు, గ్రామకార్యదర్శి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



ఘట్‌కేసర్: వెంకటాపూర్ శ్రీకట్టమైసమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. భక్తులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గీతశ్రీనివాస్, ఉప సర్పంచ్ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ రామారావు ముదిరాజ్, శ్రీనివాస్‌ముదిరాజ్, లింగంముదిరాజ్, హరీశ్, జంగయ్య, కృష్ణ, బాల్‌రాజ్, వెంకటేశ్, అశోక్, సత్తయ్య, శంకర్, శివరాజు, జంగయ్య పాల్గొన్నారు.

ఘనంగా శివపూజ



శివలింగంకు పూజలు చేస్తున్న శివ మాలధారులు

మేడ్చల్: శివ మాలధారులు శివ పూజను గురువారం మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని దాక్షాయని సమేత రామలింగేశ్వర ఆలయంలో భ్రమరాంబ దేవి సమేత మల్లికార్జున స్వామి ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. పూజలతో ఆలయ పరిసరాలు 'ఓం నమః శివాయ..' పంచాక్షరి మంత్రంతో మార్మోగింది. పూజ అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొడే మహేష్, తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

అతి కష్టంగా.. కడుపు నింపుతూ..!

ఏజెన్సీలకు సకాలంలో బిల్లులు అందక అప్పు చేసి మధ్యాహ్న భోజన వంటకాలు

- విద్యార్థుల కడుపు నింపడంలో పాట్లు
- పెంచిన వేతనాలు అందక కార్మికుల ఇబ్బందులు
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 506 ప్రభుత్వ పాఠశాలల్లో 90,301 మంది విద్యార్థులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండిపెట్టే ఏజెన్సీలకు సకాలంలో బిల్లులు అందక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వంట సామగ్రి కొనుగోలుకు అప్పులు చేయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మహిళా కార్మికులకు గౌరవ వేతనాన్ని రూ.3 వేలకు పెంచుతామని సర్కారు ప్రకటించి పది నెలలు అవుతున్నా ఇప్పటి వరకు హామీ నెరవేరలేదు. ఏళ్ల తరబడి పాఠశాలల్లో భోజనాన్ని వండి పెడుతున్న తమకు గిట్టుబాటు కావడం లేదని, కుటుంబాలు గడవడం కష్టంగా మారుతోందని నిర్వాహకులు వాపోతున్నారు.

గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లో...

- గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు జిల్లాలైన మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డిలలో మొత్తంగా 2,497 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో 3,64,139 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.
- హైదరాబాద్ జిల్లాలో 691 ప్రభుత్వ పాఠశాలల్లో 1,08,635 మంది విద్యార్థులు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 506 ప్రభుత్వ పాఠశాలల్లో 90,301 మంది విద్యార్థులు, రంగారెడ్డి జిల్లాలో 1,301 ప్రభుత్వ పాఠశాలల్లో 1,65,202 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.
- వీరందరికి మధ్యాహ్న భోజన పథకం వర్తిస్తోంది. 6 నుంచి 8వ తరగతి వరకు భోజనాన్ని వండిపెడుతున్న కార్మికులకు గతేడాది నవంబరు 22 వరకు బిల్లులు అందగా 9, 10వ తరగతుల కార్మికులకు సెప్టెంబరు 22 వరకు వచ్చాయి.
- 6 నుంచి 8 తరగతుల ఏజెన్సీలకు రెండు నెలలు, 9 నుంచి 10 తరగతుల ఏజెన్సీలకు 5 నెలల బిల్లులు రావాల్సి ఉంది. బకాయిలు రాకపోవడంతో కార్మికులకు వంటలు చేయడం భారంగా మారుతోంది.
- ప్రభుత్వం ప్రకటించిన ప్రకారంగా నెలకు రూ.3 వేల గౌరవ వేతనం కోసం వంట కార్మికులు ఆశతో ఎదురుచూస్తున్నారు.
- సర్కారు హామీని నెరవేర్చితే తమకు ఊరట లభిస్తోందని వారు పేర్కొంటున్నారు.

రూ.వెయ్యితో గట్టెక్కేదెలా?

- మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహించేందుకు 2008 నుంచి వంట కార్మికులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఒక విద్యా సంవత్సరంలో పది నెలలకు రూ.10వేల గౌరవ వేతనం చెల్లిస్తున్నారు.
- ప్రతి నెలా బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.5.45, 6 నుంచి 8వ తరగతి వరకు రూ.8.17. 9, 10వ తరగతులకు రూ.10.67 చొప్పున చెల్లిస్తున్నారు.
- గత జూన్ నుంచి గుడ్డు ధరను రూ.4 నుంచి రూ.5 పెంచినా మార్కెట్లో రూ.6 వరకు ఉండటంతో నిర్వాహకులు నష్టపోతున్నారు.
- నూనె, పప్పుల ధరలు పెరగడంతో తమపై ఆర్థికభారం పడుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెంచిన వేతనాన్ని వెంటనే అమలు చేయాలి

ప్రభుత్వం పెంచిన గౌరవ వేతనాన్ని వెంటనే అమలు చేయాలి. క్రమం తప్పకుండా బిల్లులు అందేలా చూడాలి. మధ్యాహ్న భోజనాన్ని ముగ్గురం కలిసి పిల్లలకు వండి పెడుతున్నాం. సరుకుల ధరలు బాగా పెరిగాయి. బిల్లులు సక్రమంగా రాకపోవడం వల్ల అప్పులు చేసి, వంట సామగ్రిని కొనుగోలు చేస్తున్నాం. పాత బాకీ చెల్లించడం లేదంటూ.. కిరాణ దుకాణ యజమానులు సరుకులను ఉద్దెర ఇవ్వడం లేదు.

– జయమ్మ, కార్మికురాలు

త్వరలో చెల్లిస్తాం

క్రమంగా బిల్లుల బకాయిలు అందుతున్నాయి. డిసెంబరు వరకు బిల్లులను ప్రభుత్వానికి నివేదించాం. 1 నుంచి 8వ తరగతి వరకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే బిల్లులను నేరుగా ఎంఈఓలకు అందిస్తున్నాం. మధ్యాహ్న భోజన కార్మికులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బిల్లులు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటాం.

– ఐ.విజయకుమారి, డీఈఓ, మేడ్చల్ జిల్లా

'అగ్రకుల అహంకారంతోనే.. ఆడ బిడ్డపై అవిశ్వాసం'



మేయర్ కావ్యకు మద్దతుగా నిరసన చేపట్టిన గొల్ల,కురుమ సంఘాల నాయకులు

- అవిశ్వాసాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి
- మేయర్ మేకల కావ్యకు మద్దతుగా గొల్లకురుమ సంఘాలు
- పదవికి అడ్డుపడితే ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరిక
- జవహర్‌నగర్‌లో భారీ ర్యాలీ, నిరసన

జవహర్‌నగర్: అగ్రకుల అహంకారంతోనే ఆడబిడ్డ అయిన మేయర్ మేకల కావ్యపై అవిశ్వాసానికి తెరలేపారని, పెట్టిన అవిశ్వాసాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని గొల్లకురుమ సంఘాల నాయకులు హెచ్చరించారు. వారం రోజుల క్రితం మేయర్ కావ్యపై కలెక్టర్ కార్యాలయంలో అవిశ్వాసం పెట్టి క్యాంపు రాజకీయాలు చేస్తూ కురుమ ఆడబిడ్డను భయపెడుతున్నారని మేడ్చల్ కురుమ, యాదవ సంఘాలు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి జవహర్‌నగర్‌లో ర్యాలీ చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు బీర సురేష్‌కురుమ, యాదవ సంఘం జవహర్‌నగర్ అధ్యక్షుడు సత్యనారాయణయాదవ్‌లు మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో మేకల కావ్య అతిచిన్న వయస్సులోనే మేయర్ కావడం కొంత మంది అగ్రవర్ణాల నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. అవిశ్వాసం లేదని తెలిసినా ఆమెను మానసికంగా భయపెట్టాలని ప్రయత్నిస్తున్నారని, వారి ఆటలను ఇక సాగనివ్వమన్నారు. మేయర్ కావ్య బహుజనుల అభ్యున్నతికి ఎల్లవేళలా కృషి చేస్తూ జవహర్‌నగర్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తుందన్నారు. ఇప్పటికైనా అవిశ్వాస పత్రాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే వారి ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో కురుమ కులంలో ఏకైక మేయర్ కావ్య ఒక్కరే ఉన్నారని, అన్యాయం జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమరు సంఘం ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ కురుమ, జంట నగరాల ఉపాధ్యక్షుడు రామ్మోహన్ కురుమ, జిల్లా కురుమ సంఘం నాయకులు భాస్కర్, వినోద్, వెన్నెల, పర్వతాలు, గట్టయ్య, పాండు, అంజయ్య, నాగరాజు, యాదవ సంఘం సభ్యులు నర్సింహా యాదవ్, కృష్ణయాదవ్, కురుమ సంఘం బాలాజీనగర్ సభ్యులు బాలస్వామి, మీనయ్య, రమేష్, బీడ మల్లేష్, చిట్కూరి రమేష్, సదానందం, భాస్కర్, ఎల్లయ్య, సువర్ణ, సత్యనారాయణ, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎన్ కన్వెన్షన్ ప్రారంభం



ఆలయంలో నూతనంగా నిర్మించిన ఎంఎల్‌ఎన్ కన్వెన్షన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: చీర్యాల శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం వద్ద ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎంఎల్‌ఎన్ కన్వెన్షన్‌ను గురువారం మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ల శాఖ చీఫ్ ల్యాండ్ కమిషనర్ నవీన్‌మిట్టల్, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ జిల్లా మాజీ కలెక్టర్ ఎంవీ రెడ్డి, బీఆర్‌ఎస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి, సినీనటుడు బాబుమోహన్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీలను నిలిపి వేయండి



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్ తదితరులు

ఘట్‌కేసర్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జరుగుతున్న అక్రమ బదిలీలను వెంటనే నిలిపేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ శాఖ ఆధ్వర్యంలో సభ్యులు అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డికి గురువారం వినతి అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాంబాబు, సీతారాం, రామకృష్ణ, విజయ్, గోపీనాథ్, సునీల్, చందర్ పాల్గొన్నారు.

'ఫేక్ సర్టిఫికెట్లను జీహెచ్‌ఎం అడ్డుకుంటుంది'

ఉపాధ్యాయుల బదిలీల్లో అక్రమాలపై చేసిన ఫిర్యాదుపై ప్రత్యేక వైద్య బృందంతో పరిశీలించేందుకు అవకాశం కల్పించాలని తెలంగాణ గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.రాంరెడ్డి డిమాండ్ చేశారు. ప్రత్యేక కోటా కింద బదిలీల్లో కొందరు ఫేక్ మెడికల్ సర్టిఫికెట్లతో లబ్ధిపొందే అవకాశముందని, దీంతో మనకు రావలసిన ప్లేస్ రాకుండా పోతుందన్నారు. అవసరమైతే డీఈఓ, ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసి హెచ్‌ఎంలకు అన్యాయం జరగకుండా చూస్తుందన్నారు.

వైభవంగా శివలింగం విగ్రహ ప్రతిష్ఠ



పూర్ణాహుతి హోమం చేస్తున్న దృశ్యం

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి హనుమాన్ ఆలయంలో మరకత శివలింగం, నవగ్రహ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. మూడ్రోజుల పాటు చేపడుతున్న ఈ ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు, నాయకులు కొండల్‌రెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీలో అద్దె బస్సుల డ్రైవర్లకు శిక్షణ



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ నర్సింహా రెడ్డి

మేడ్చల్: ఆర్టీసీలో అద్దె బస్సులు నడిపే డ్రైవర్లకు మేడ్చల్ డిపోలో ట్రాఫిక్ పోలీసులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డ్రైవర్లు తప్పకుండా ట్రాఫిక్, రోడ్డు భద్రతా నియమ, నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ నర్సింహా రెడ్డి కోరారు. డ్రైవర్లు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని, సెల్ ఫోన్, ర్యాష్ డ్రైవింగ్ ఎట్టి పరిస్థితుల్లో చేయొద్దని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంఓ రవిశంకర్‌రెడ్డి, డీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఏర్పాటుకు కేటాయించిన భూ దస్తావేజుల అప్పగింత



కోట్యనాయక్‌కు దస్తావేజులు అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్‌లో నిర్మించనున్న వంద పడకల ఆస్పత్రికి సర్వే నంబర్.166లోని రెండెకరాల భూమిని కేటాయిస్తూ కలెక్టర్ గతంలో ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశానుసారం నాయబ్ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఆర్‌ఐ అలేఖ్య, సర్వేయర్ జగదీష్ భూమికి సంబంధించిన దస్తావేజులు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి కోట్యనాయక్‌కు, స్థానిక కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి సమక్షంలో భూమికి సంబంధించిన గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, ముత్యంరెడ్డి, కృష్ణకుమార్, పాండు పాల్గొన్నారు.

ఓంకార క్షేత్రంలో విగ్రహ ప్రతిష్ఠాపన



ఓంకార క్షేత్రంలో పూజలు చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని సాయిప్రియా కాలనీలోని ఓంకార క్షేత్రంలో గురువారం నూతన ధ్వజస్తంభం, కాలభైరవ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయాభివృద్ధికి తనవంతుగా రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాండాల అనురాధ యాదగిరిగౌడ్, బీఆర్‌ఎస్ నేతలు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రం విద్యారంగంపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది'



నిరసన చేపట్టిన ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విద్యారంగం పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని, విభజన హామీ చట్టం ప్రకారం.. తెలంగాణకు రావలసిన విద్యాసంస్థలు ఒక్కటి కూడా రాలేదని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, జిల్లాకో నవోదయ పాఠశాల, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంపై జీఎస్టీ భారం వేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి అన్వర్, హరీశ్, మహేశ్, శివ, సాయి, వెంకట్ పాల్గొన్నారు.

'క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు'



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోందని ఎస్సై విజయకృష్ణ అన్నారు. హర్యానాలో జరిగిన యూత్ గేమ్స్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో కబడ్డీ, అథ్లెటిక్స్, తైక్వాండో విజేతలకు పట్టణంలోని ఎస్వీఆర్ హైస్కూల్లో గురువారం నిర్వహించిన అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడినా ఆడుతూనే ఉండాలన్నారు. అకాడమిక్ డైరెక్టర్ ఉన్ని కృష్ణన్ మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడల్లో పాల్గొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాకేశ్, బాల్‌చందర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా



కీసరలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్నాయని కొమ్మలను నరికి వేసిన విద్యుత్ సిబ్బంది

కీసర: అధికారుల అనాలోచిత చర్యల వల్ల ప్రజాధనం వృథా కావడమే కాకుండా ఏళ్ల తరబడి కష్టపడి పెంచిన చెట్లు నేలపాలవుతున్నాయి. కీసర ఓఆర్‌ఆర్ నుంచి కీసరగుట్ట వరకు గల ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా గతంలో హుడా, హరితహారంలో నాటే మొక్కలను విద్యుత్ లైన్ల కింద వేపుగా పెరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ లైన్ల మరమ్మతుల పేరిట విచక్షణారహితంగా చెట్ల కొమ్మలను నరివేస్తున్నారు. దీంతో వేసవిలో రహదారుల వెంట పచ్చదనానికి వేపుగా పెరిగిన చెట్లు మొండి బారిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల పెంపకం సమయంలోనే విద్యుత్ లైన్ల కింద మొక్కలను నాటకుంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని విద్యుత్ అధికారులు సిబ్బంది పేర్కొంటున్నారు. రెండు శాఖల అధికారుల సమన్వయ పోలం వల్ల ఇటు పచ్చదనం, అటు ప్రజాధనం కూడా వృథా అవుతుందని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి



మైసమ్మగుట్టలో శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న కమిషనర్ వేమనరెడ్డి, వైస్ చైర్మన్ మాధవరెడ్డి



కంటి అద్దాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి

కీసర: ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకాన్ని పేద ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని రాంపల్లి వార్డు కార్యాలయంలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ వాణీరెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ నాలుగో వార్డులో...

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని నాలుగో వార్డు మైసమ్మగుట్ట కాలనీలో కంటి వెలుగును స్థానిక కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్‌తో కలిసి మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డిలు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈఓ సాత్విక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, కంటి నిపుణులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి 7వ వార్డులో...

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 7వ వార్డులో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి వార్డులోని ప్రజలు శిబిరాలకు తప్పకుండా వెళ్లి కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు కంటి అద్దాలు, కంటి చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. శిబిరాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రాములు, కౌన్సిలర్ రాజమణి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం, ప్రైవేటు ఉద్యోగం చేస్తుండటంతో..

ఎల్లంపేట్ బిల్ కలెక్టర్ తొలగింపు

మేడ్చల్: గ్రామ పంచాయతీలో పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎల్లంపేట్ బిల్ కలెక్టర్ తిరుపతిరెడ్డిని గ్రామ పంచాయతీ విధుల నుంచి తొలగించింది. గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్‌గా 18 సంవత్సరాలుగా పని చేస్తున్న తిరుపతిరెడ్డి ప్రైవేటు ఉద్యోగిగా ఉంటూ నెలకు రూ.37వేల జీతం తీసుకుంటున్నాడు. పలు నిధులు, అధికార దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయనపై గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ యువకులు డీపీఓకు ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. ఎంపీఓ విచారణ చేసి తిరుపతి దోషిగా తేల్చడంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని డీపీఓ గ్రామ పంచాయతీని ఆదేశించారు. ప్రైవేటు ఉద్యోగి కావడంతో తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శిపై అధికారుల ఆదేశానుసారం తిరుపతిరెడ్డిని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.